# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 31 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం



## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన



# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి
- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, జూలై 30: తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం మిగతా 3లో..

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,జూలై30 : అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు.ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగిం చాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాల యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం మిగతా 3లో..

## ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత

మిగతా 2లో..

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

- అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి
- ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు



హైదరాబాద్, జూలై 30: రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఢాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు మిగతా 3లో..

## రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

- లీకులపై కఠిన చర్యల కోసమే బిల్లు అని చెప్పిన మంత్రి
- విద్యార్థులపై లాఠీ-ఛార్జ్‌పై అమిత్ క్షమాపణలు చెప్పాలన్న ఖర్గే



న్యూఢిల్లీ,జూలై30 : ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించ బోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో

## బెంగాల్లో మాజీ డ్రైవర్ ఇంట్లో నోట్ల కట్టలు

- సుమారు రూ.28 కోట్ల నగదు, 15 కిలోల పసిడి స్వాధీనం
- 5 కౌంటింగ్ మెషిన్లు పెట్టినా విఫలమైన అధికారులు

మిగతా 3లో..

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు
- అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, జూలై 30: వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్ష్షాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో మిగతా 3లో..

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం



లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు

న్యూఢిల్లీ,జూలై30 : వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్ మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాలనిరసనలనడుమరెండుసభల్లోనూబిల్లుకుఆమోదం లభించింది.

## పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

- రిజర్వాయర్లను నింపాలనే సోయి రాకపోతే ఎలా
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్



మిగతా 3లో..

## భారీ వర్షాలు కురిసే ఛాన్స్

- ఆదిలాబాద్, జగిత్యాలకు రెడ్ అలర్ట్

మిగతా 3లో..



బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



భద్రాద్రి కొత్తగూడెం,జూలై30 : పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ





- ఎల్‌నినోపై ఇరు నేతల చర్చ
- ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలన్న పవన్

అమరావతి,జూలై30 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.నీటి విడుదలతో పిఠా పురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగు నీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగా హన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.

# మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి



## సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ

న్యూఢిల్లీ,జూలై30 : జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించా లని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిసనర్ల తరుపుణ న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ కాల్పుల్లో గాయపడిన వారికి పూర్తి న్యాయ సహాయం అందించాలని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ పోలీసులు సమర్పించే స్టాండింగ్ ఆర్డర్, పెలలెట్ గన్ వినియోగంపై కోర్టు చేపట్టే పరిశీలన కీలకంగా మారే అవకాశం ఉంది.

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత



హైదరాబాద్, జూలై 30 : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్‌కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు.ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు, పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదేమీ లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.మీ. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం.మీ., బెజ్జూరులో 14, సెం.మీ., కన్నాయిగూడెంలో 13 సెం.మీ., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.మీ., నస్పూర్ 11.8 సెం.మీ. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.మీ., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.మీ., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.మీ., సిర్పూర్(టి)లో 10.5 సెం.మీ., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

పుణె,జూలై30 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పెలలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు.

పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

# కంగనాకు అంత కోపం పనికిరాదు

- యువతను విమర్శించడం సిరకాదన్న సౌరవ్





న్యూఢిల్లీ,జూలై30 :భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ తనపై చేసిన విమర్శలపై కాక్రోజ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఘాటుగా స్పందించారు. తనను పనికిరాని వాడు, నిరుద్యోగి అని పిలవడాన్ని తప్పు పట్టారు. గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఇలాంటి తప్పుడు సమాచారమే వస్తుందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో సౌరవ్ మాట్లాడుతూ.. ఆమె ఈ దేశ భవిష్యత్ తరాలను, యువతను తీవ్రంగా విమర్శిస్తున్నారన్నారు. కంగనా నా వ్యాఖ్యలపై ఎందుకు అంతగా స్పందించారో అర్థం కావడం లేదు. ఇదే మాట నా స్నేహితులు కూడా అంటున్నారు. 'ఆమెకు నువ్వు చిన్నప్పటి హృతిక్ రోషన్ లాగా కనిపిస్తున్నావేమో' అనినా ఫ్రెండ్ మెసేజ్ చేశాడు.అది నిజమేనా? నా స్నేహితులు ఇలా అనడంతో నేను చాలా ఆశ్చర్యపోయాను అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. అయితే, తనకు కంగనాపై వ్యక్తిగత ద్వేషం లేదని సౌరవ్ స్పష్టం చేశారు. ఆమెతో గొడవ పడాల్సిన అవసరం నాకు లేదు. విభేదాలు ఏవైనా ఉంటేచర్చించి పరిష్కరించుకోవాలి. ఈ రోజు నా ఇన్ స్టాగ్రామ్ స్టోరీలోనూ ఇదే పోస్ట్ చేశాను. 'కంగనా.. కాస్త ప్రశాంతంగా ఉండండి.. మాట్లాడుకుందాం' అని క్యాప్షన్ పెట్టా. దేశంలో చర్చలు, సంభా షణలు తగ్గిపోవడం పెద్ద సమస్యగా మారింది. పరస్పర గౌరవంతో చర్చించుకునే వాతావరణం ఉండాలని సౌరవ్ అన్నారు. అలాగే కంగనా తన వ్యాఖ్యలను పునఃసమీక్షించుకోవాలని హితవు పలికారు. తనతో మాట్లాడా లంటే కంగనా డైరెక్ట్‌గా ఫోన్ చేయొచ్చని.. ఆమెతో సంభాషించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సౌరవ్ తెలిపారు.

## భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ

- ఉద్యోగులకు అలర్ట్ జారీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్,జూలై30 : తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీచేశారు. నగరంలోని కంపెనీలు, సంస్థలు సాధ్యమైన చోట వర్క్‌ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రయాణ ప్రమా దాలు తగ్గించి, రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సంస్థలు తమ కార్యాలయ స్థానం, ముందస్తు లాగౌట్ సమయాలను ట్రాఫిక్ పోలీసులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచిం చారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వర్షం పడుతున్నప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన



హైదరాబాద్,జూలై30 : తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కు రుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# (మొదటిపేజీ తరువాయి)

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణేళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. 'నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు..

# గోదావరి పరివాహకంలో అప్రమత్తంగా ఉండండి

- ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి
- వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్



జగిత్యాల,జూలై30 : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.

## పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి



- రిజర్వాయర్‌లను నింపాలనే సోయి రాకపోతే ఎలా
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్, జూలై 30 : గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఎ÷-లో ఎంత ఉందో అవుట్ ఎ÷-లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

## ఎన్నికల్లో గెలవకుండా మంత్రిగా ఇంకెంతకాలం

- వరుసగా రెండుసార్లు మంత్రిగా కొనసాగడం సరికాదు
- బీహార్ మంత్రి దీపక్ ప్రకాశ్‌ను ఉద్దేశించి సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జూలై30 :ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది. లేదా శాసనమండలి సభ్యుడిగానైనా ఎన్నిక కావాలి. కానీ దీపక్ ప్రకాశ్ 2025 నవంబర్‌లో పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఏప్రిల్ 25, 2026 వరకు మంత్రిగా కొనసాగారు. అప్పుడు నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో క్యాబినెట్ మొత్తం రద్దయింది. తర్వాత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా.. దీపక్ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మధ్యలో 22 రోజులు ఏ పదవీలో లేరు. అంటే నిరవధికంగా ఆరునెలల పాటు దీపక్ మంత్రిత్వ బాధ్యతల్లో లేనట్లయ్యింది. సాధారణంగా ఆరు నెలల్లోపు శాసనసభకు ఎన్నిక కాకపోతే.. మంత్రి పదవిని కోల్పోతారు. కానీ ఇక్కడ ఒకే మంత్రి విషయంలో ఆరు నెలల గడువును రెండుసార్లు వినియోగి చడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. దీపక్ ఎన్నికల్లో గెలవకపోయినా ఆయనను రెండోసారి మంత్రిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని, మంత్రి పదవి కేటాయింపు చెల్లనిదిగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చట్టాన్ని ప్రశ్నించడమే అవుతుంది. ఎన్నిక కాకుండా ఒక మంత్రిని ఆరునెలలకు పైగా ఎలా కొనసాగిస్తున్నారనే దానిపై సమాధానం ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తదుపరి విచారణను ఆగస్టు 4కు వాయిదావేసింది.ఇదిలా ఉంటే.. ప్రమాణస్వీకారం సమయంలో కూడా దీపక్ వార్తల్లో నిలిచారు. ప్రముఖ రాజకీయ నాయకులంతా కుర్తా, పైజామా, ధోవతీలతో రాగా.. దీపక్ మాత్రం చాలా డిఫరెంట్‌లుక్‌లో కనిపించి, అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు. క్యాజువల్ షర్ట్, ప్యాంట్ ధరించిన ఆయన.. అదే వేదికపై ఉన్న ప్రధాని మోదీని కలిశారు. రాష్ట్రీయ లోక్ మోర్చా చీఫ్ ఉపేంద్ర కుశ్వాహా కుమారుడే ఈ దీపక్. ఆయన తల్లి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు

## సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

### ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పిఐబి

న్యూఢిల్లీ,జూలై30: ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్రప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయ లేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉం డా లని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధా రణ చేసుకోకుండాఇలాంటి సందేశాలను నమ్మకూ డదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రా లు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరు గుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధా రంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసు కోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమా నాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారి త నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

పెద్దపల్లి,జూలై30 : కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ -2 ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల ప్రక్రియ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం కూడా నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రష్ గేట్ల ద్వారా జలాలు ఏడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది. ఆ పంప్ హౌస్ లోని నాలుగు బహుబలి మోటార్లను ఆన్ చేసి అక్కడ నుంచి వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీటిని తరలిస్తున్నారు

## భారీ వర్షాలు కురిసే ఛాన్స్

### ఆదిలాబాద్, జగిత్యాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్, జూలై 30 : తీవ్ర వాయుగుండం నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తో పాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## త్వరగా భద్రకాలి బండ్ పనుల పూర్తి

### అధికారులకు కమిషనర్ ఆదేశాలు

వరంగల్,జూలై30 : భద్రకాళి బండ్ పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ టి.వెం కన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా భద్ర కాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ త్వరితగతిగా బండ్‌పై మిగిలిపోయిన పెండింగ్ పనులను ఆగస్టులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.భద్రకాళిబండ్, వడ్డేపల్లి బండ్‌పై హార్టికల్చర్‌కు సంబంధించి గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, కమిష నర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మి రెడ్డి, డీఈ రాజ్ కుమార్, ఏఈ హరికుమార్ తదితరులు ఉన్నారు.

## బెంగాల్లో మాజీ డ్రైవర్ ఇంట్లో నోట్ల కట్టలు

- సుమారు రూ.28 కోట్ల నగదు, 15 కిలోల పసిడి స్వాధీనం
- 5 కౌంటింగ్ మెషిన్లు పెట్టినా విఫలమైన అధికారులు

కోల్‌కతా,జూలై30 : పశ్చిమ బెంగాల్‌లోని ఓ మాజీ డ్రైవర్ ఇంట్లో పెద్దఎత్తున నగదు, బంగారం బయటపడటం తీవ్ర దుమారం రేపుతోంది. బీర్‌భూమ్ జిల్లాలో మినార్ మొండల్ అనే విశ్రాంత బస్సు డ్రైవర్ నివాసంలో పోలీసులు నిర్వహించిన సోదాల్లో ఇప్పటివరకు సుమారు రూ.28 కోట్ల నగదు, 15 కిలోల పసిడి స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. నోట్ల కట్టలు భారీగా ఉండటంతో.. వాటిని లెక్కించే క్రమంలో 5 కౌంటింగ్ మెషీన్లు విఫలమైనట్టు తెలుస్తోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తులు మొండల్ అనే శిలల వ్యాపారికి మినార్ మొండల్ బంధువు. తులు మొండల్.. తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత అనుబ్రత మొండల్‌కు సన్నిహితుడు. ఈ నేపథ్యంలో వీరు అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సోదాలు నిర్వహించగా.. తొలుత రూ.5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారం లభించాయి. ఆ తర్వాత తనిఖీలు కొనసాగించడంతో నగదు మొత్తం సుమారు రూ.28 కోట్లకు చేరింది. ఈ ఘటనపై మినార్ మొండల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో ఈ నగదు, బంగారం తులు మొండల్‌కు చెందినదని, అక్రమ కార్యకలాపాలు నిర్వహించి పొందిన సొమ్ముగా పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక వివరాలూ వెల్లడించలేదు. అక్రమ ఆర్థిక లావాదేవీలు, ఇసుక-రాతి మాఫియా కార్యకలాపాలతో ఈ వ్యవహారానికి సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## సంపాదకీయం

# పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్య మించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయ లేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్దతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళ్లల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించు కుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

# పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ, జూలై 30 : లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే ఢిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. ఆఖరికి వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇ కపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వాయుగుండ ప్రభావంతో వర్షాలు

## పలు జిల్లాల్లో జోరుగా వానలు



హైదరాబాద్, జూలై 30: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమబెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో మూడ్రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. అటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పాలెంలలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, గురు, శుక్రవారాల్లోనూ బలమైన గాలుల కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ఎల్ నినో కారణంగా జూన్, జూలైలో -49 సెం.మీ లోటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడించాయి. నిరుడు ఇదే సమయానికి 33.3 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

# మద్యం కేసులో కారుమూరికి చుక్కెదురు

## ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ,జూలై30:ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. నేరం జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఈ కేసులో కస్టోడియల్ దర్యాప్తు అవసరమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏపీ మద్యం కుంభకోణంలో సుమారు రూ.350 కోట్ల ప్రజాధనం దారి మళ్లినట్లు ఆధారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది.ఈ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితుడి విచారణ అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. కస్టోడియల్ దర్యాప్తు లేకుండా పూర్తిస్థాయిలో నిజాలను వెలికితీయడం కష్టమని పేర్కొంది. కారుమూరి నాగేశ్వరరావు తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ కోసం వాదనలు వినిపించినప్పటికీ, సుప్రీంకోర్టు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. దర్యాప్తు సంస్థలకు సహకరించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది.

# జీవ వైవిధ్యంలో పులుల పాత్ర కీలకం

## అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంలు తెలిపిన పవన్

హైదరాబాద్, జూలై 30: జీవ వైవిధ్య పరిరక్షణలో పులుల పాత్ర అమోఘమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవుల పరిరక్షణలో భాగస్వాములైన ప్రకృతి ప్రేమికులందరికీ అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పులుల సంరక్షణలో దేశానికే ఆదర్శంగా ఏపీని నిలిపామని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. తూర్పు కనుమల్లో పులుల పునరుజ్జీవం వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. నల్లమలలో పులి గర్జన శాశ్వతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పులి కేవలం మన జాతీయ జంతువు మాత్రమే కాదని, మన దేశ అటవీ సంపదకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అని ఉద్ఘాటించారు. ప్రపంచ పులుల దినోత్సవం 2010లో పులుల సంరక్షణ కోసం అంతర్జాతీయ సమాజం తీసుకున్న సంకల్పాన్ని మనకు గుర్తు చేస్తుందని తెలిపారు. అదే సమయంలో పులుల పరిరక్షణలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన తీరును గుర్తు చేస్తుందని అన్నారు. 'ప్రాజెక్ట్ టైగర్' వంటి దూరదృష్టితో కూడిన కార్యక్రమాల ఫలితంగా నేడు ప్రపంచంలోని పులుల్లో దాదాపు 75 శాతం మన దేశంలో నివసిస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశం సాధించిన అపూర్వ పర్యావరణ విజయానికి



నిదర్శనమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ



## ఉద్యోగులకు అలర్ట్ జారీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్,జూలై30 : తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. నగరంలోని కంపెనీలు, సంస్థలు సాధ్యమైన చోట వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రయాణ ప్రమాదాలు తగ్గించి, రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సంస్థలు తమ కార్యాలయ స్థానం, ముందస్తు లాగౌట్ సమయాలను ట్రాఫిక్ పోలీసులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వర్షం పడుతున్నప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక



పుణె,జూలై30 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నా యని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పెలలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

### వర్షాలు సమృద్ధిగా కురవాలి..

# చెరువులు నిండాలి.. పంటలు పండాలి..

**- తెలంగాణ సస్యశ్యామలం కావాలని మంత్రుల ఆకాంక్ష**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండి,పంటలు పండి తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.గురువారం

జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడకు చేరుకున్న మంత్రులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో మంత్రులను ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించారు. అలాగే జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో అధికారికంగా శ్రీకారం చుట్టారు.భీమేశ్వర సదన్ ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లోని వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాలతో మంత్రులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, వరుణయాగం కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు.





సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు.

వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందడంతో రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో రూ. 12 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్త మాతృకల విగ్రహాలు, గార్డెన్, మొక్కలు, భారీ శివుడి విగ్రహాన్ని పరిశీలించారు.



## నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించాం..

**తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు అన్నారు.వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ను రూ.1.62 కోట్లతో ఆధునీకరణ పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి హామీని నిలబెట్టుకుందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపట్టామని అన్నారు . 1984లో నిర్మించిన బస్‌స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, దక్షిణ కాశిగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సుతో పాటు గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని, నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు రూ.240 కోట్లతో కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా బస్‌స్టేషన్ ఆధునీకరణ కూడా జరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గతంలో బస్‌స్టేషన్‌ను తొలగించే ప్రయత్నాలు జరిగాయని, ప్రజల ఆకాంక్ష మేరకు దానిని కొనసాగిస్తూ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో పలుమార్లు కూలిపోయిన సమీప వంతెనను భూ నిర్వాసితులకు న్యాయం చేస్తూ పూర్తి చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి 2023–24లో రూ.50 కోట్లు, 2024–25లో రూ.100 కోట్లు, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి చేసి రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు ..భక్తుల కోసం రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం, రూ.47 కోట్లతో 80 అడుగుల రహదారి విస్తరణ, రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో గుడి చెరువు బండ్ పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు.ఇక్కడ జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లలో నీటిని తాగునీటికి వినియోగించాలి..

**-సూపర్ ఎల్ నినో ఎక్కువ ప్రభావం దక్షిణ భారత దేశంపైనే**

**-రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి***

**-జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




సూపర్ ఎల్ నినో ప్రభావం దక్షిణ భారత దేశంపై ఎక్కువగా ఉంటుందని, వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, ఇప్పుడు రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు.జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి? వాటిలో నీటిమట్టం? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు? మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా? విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు కొంత మేలు చేస్తుందని, కానీ పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ఉపయోగపడదని తెలిపారు.గత రెండు నెలలు సరిగా వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. మంచి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు.

**ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలి**

గత ఏడాదితో పోలిస్తే భూ గర్భ జలాలు రెండు మీటర్లకుపైగా లోతులోకి వెళ్ళాయని,జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూ గర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని అన్నారు . తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు.

జిల్లాలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని, రిజర్వాయర్ల నీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు.నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, జిల్లాలో ఎరువుల కొరత, ఇతర ఇబ్బందులపై వచ్చే అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని సూచించారు. పోలీస్ అధికారులు శాంతి భద్రతల పరిరక్షిస్తూనే ప్రతీ అంశంపై దృష్టి సారించాలని ఆదేశించారు.

సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

**రైతులకు అవగాహన కార్యక్రమాలు..**

ఎల్ నినో, పంటల మార్పిడిపై జిల్లాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంచార్జి మంత్రి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయం కీలకమని తెలిపారు. గత ఏడాది జిల్లాలో లక్ష 85 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, ఈ ఏడాది ఇప్పటి వరకు78 వేలు సాగు అయిందని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతు భరోసా అందుతున్న రైతులందరికీ ఈ విషయమై ఫోన్లకు సమాచారం పంపుతున్నామని అన్నారు . ఆగస్టులో సాగు చేసే పంటలపై ఇప్పటికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు ఆయిల్ పామ్ 1500 ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 400 ఎకరాలు పూర్తి చేయించామని, మిగతా పురోగతిలో ఉందని,తెలంగాణ జలసిరి కింద జిల్లాలో నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ రాజరాజేశ్వర జలాశయంలోకి భారీగా వచ్చి చేరుతున్న నీరు

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేర్) లోకి బారీగా ఇన్ ఫ్లో నీళ్ళు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం డ్యాంలో 17,242 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా అందులో ఎల్లంపల్లి నుండి 12,600 క్యూసెక్కులు, మూలవాగు మరియు మానేరువాగుల నుండి ప్రాజెక్టుకు 4,642 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుందని, ప్రాజెక్ట్ నీటిమట్టం 318 మీటర్లకు గాను 308.21 మీటర్ల కు చేరుకుంది. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ 27. 55 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.858 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలను మరియు పోల్స్ కు దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా Dail 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని కోరారు.

# ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

**వ్యవసాయ అధికారి**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

ప్రస్తుతం పడుతున్న వర్షాలను చూసి వరి పంట వేసుకోవద్దని, ఇంకా 3-4 నెలల కాలం నీటి లభ్యత చూసుకుని మాత్రమే పంటలను సాగుచేసుకోవాలని, ఈ రోజు ఎలాగోలా నాటు వేసుకుని పంట పొట్ట దశలో బావిలో నీరు లేక ఎండిపోతే ఎకరానికి 30-40 వేలు నష్టం వాటిల్లే ముప్పు ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మండలం మానువాడ, రామన్నపేట గ్రామలలో ఈ రోజు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఏవో మాట్లాడుతూ: రైతులు తమ మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించడం జరిగింది.తక్కువ నీటితో సాగు చేయగల కంది, పొద్దు తిరుగుడు , ఆముదం పంటలని ఆగస్టు 15 వరకు వేసుకోవచ్చు , ఆగస్టు 15 నుండి నువ్వు పంట వేసుకోవచ్చని తెలిపారు.

పామ్ ఆయిల్ పంట ఉపయోగాలు, సాగు, రాయితీ వివరాలు రైతులకు వివరించడం జరిగింది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వానచినుకుని సంరక్షించుకుంటేనే ప్రయోజనం ఉంటుంది కనుక వీబీజి రామ్ పథకం కింద రైతులు తమ బోర్ల చుట్టూ రీచార్జ్ గుంతలను తవ్వుకోవాలని, దీనికి అయ్యే ఖర్చు సుమారు 36000/- ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం రాయితీపై అందచేస్తుందని తెలిపారు.పంట కుంటలు వరద నీటిని నిల్వ చేసుకోవడానికి ఒక గుంట స్థలంలో 72000/- రూపాయలతో 100 శాతం రాయితీ పై నిర్మించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు చింతలపల్లి కవిత, వ్యవసాయ అధికారి ప్రణీత, ఏఈఓ రవళి, మానువాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, షబానా, రైతులు పాల్గొన్నారు.





## వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ అన్నారు.గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ సూచించారు.

వర్షాల కారణంగా గ్రామంలో సమస్యాత్మకంగా మారిన పాత ఇళ్లు, విద్యుత్ స్తంభాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్ళి, బాధితుల బాగోగులు అడిగి తెలుసుకుని, వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు.వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాల గుండా విద్యుత్ ప్రవహించే ప్రమాదం ఉన్నందున, పిల్లలను కరెంటు స్తంభాల వద్దకు వెళ్లకుండా చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

రాబోయే 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, చెరువులు, కుంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు ఎవరూ వెళ్లవద్దని కోరారు.

ముఖ్యంగా రైతులు ఎలాంటి విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేయకూడదని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు లేదా సర్పంచ్‌కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితి అయితేనే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ కోరారు.



## సిరిసిల్ల పెద్దబజారులో భారీ వేప చెట్టు కూలి వ్యక్తికి గాయాలు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం..

బలగం టీవీ, సిరిసిల్ల:

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పెద్దబజారులో గురువారం ఓ భారీ వేప చెట్టు ఒక్కసారిగా నేలకొరిగింది. ఈ ఘటనలో అక్కడ నిలిపి ఉంచిన టాటా ఏస్ వాహనం, ఓ మినీ వ్యాన్‌పై చెట్టు పడటంతో ఆస్తి నష్టం సంభవించింది.

ప్రమాద సమయంలో మినీ వ్యాన్‌లో ఉన్న ఓ వ్యక్తికి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి అతడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. చెట్టు కూలిపోవడంతో విద్యుత్ తీగలు కూడా తెగిపడటంతో కొంతసేపు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఘటన జరిగిన సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించే పనులు చేపట్టారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు తెగిపోయిన తీగలను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు ప్రారంభించారు. నిరంతర వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్ద చెట్లు, పాత భవనాల సమీపంలో అవసరం లేకుండా నిల్చోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



## వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల, అడ్లూరి లకు స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. వరుణ యాగంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది. ప్రజల భద్రత దృష్ట్యా 24 గంటల పాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF) బృందాలు అప్రమత్తంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించింది. పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదని, అలాగే చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్ద చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, చెట్ల కింద లేదా శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది. వరదలతో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, వంతెనలపై ప్రయాణించకుండా ఉండాలని, రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వాహనాలను అత్యంత నెమ్మదిగా నడపాలని సూచించింది. చెరువుల కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని జిల్లా పోలీస్ శాఖ కోరింది. "మీ భద్రత... మా బాధ్యత" అనే నినాదంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని జిల్లా పోలీసులు మరోసారి విజ్ఞప్తి

## వర్షాకాలంలో గౌడ్ అన్నలు జాగ్రత్త గా ఉండాలి..

బలగం టీవీ, బోయినిపల్లి:



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాకాలంలో గౌడ అన్నలు పలు జాగ్రత్తలతో ఉండాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో తాటి చెట్లపై పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా వర్షం పడడం వల్ల తాటి చెట్టు ఎక్కేటప్పుడు జారే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించుకోవచ్చు అని గౌడ్ అన్నలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బత్తిని అనిల్ గౌడ్, మూల కరుణాకర్ గౌడ్, తాళ్లపల్లి గణేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు

బలగం టీవీ, ముస్తాబాద్:

ముస్తాబాద్ మండల బీజేపీ కార్యాలయంలో బుధవారం రోజు సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలను మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులురెడ్డబోయిన గోపి హాజరై శ్రీ గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. శ్రీ గురు రవిదాస్ మహారాజ్ క్రీ.శ. 15–16వ శతాబ్దాలకు చెందిన ప్రముఖ భక్తి ఉద్యమ ఆధ్యాత్మిక కవి, సామాజిక సంస్కర్త, మహనీయ సంత్ అని పేర్కొన్నారు. సమానత్వం, సోదరభావం, మానవతా విలువలు, సామాజిక న్యాయం వంటి గొప్ప సందేశాలను తన బోధనల ద్వారా సమాజానికి అందించారని కొనియాడారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో ఆయనను ఆధ్యాత్మిక గురువుగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ధార్మిక సెల్ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మెరుగు అంజాగౌడ్, గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు ఎదునూరి గోపి, బుచ్చెల్లి మహేశ్వరి, మండల కోశాధికారి జిల్లెల్ల మల్లేష్, గూడెం ఉపసర్పంచ్ దగ్గు నవీన్, తోట్ల మల్లేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, ఆర్. శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు కస్తూరి గంగారెడ్డి, కరెడ్ల రమేష్, కస్తూరి కార్తీక్ రెడ్డి, బూత్ అధ్యక్షులు దీటి సత్యం, నిరటి సాయికుమార్, రాగుల వంశీ, వినయ్, చల్ల శివకృష్ణ, ఆకాశ్, వెంకటేష్, పున్నం అనిల్, శ్యామ్తో పాటు బీజేపీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతన్నల కష్టానికి అండగా ప్రభుత్వం..

**-నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం..**

**-జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని,సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు.చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని, యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని,ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని,నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024–25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని అన్నారు.

నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని , 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్&బీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, భవనాలు, రహదారులు, లో లెవెల్ కల్వర్టులు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.లో లెవెల్ కల్వర్టులు, వాగులు, వంతెనలు, రహదారులపై నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడైనా వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ లేదా పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు క్షేత్ర స్థాయిలో



అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువులు, కుంటలు, వంతెనలు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. జిల్లాలోని జలాశయాల పరిస్థితులు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో తదితర వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షం కురిసిన తర్వాత డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఖచ్చితంగా నిర్వహించాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, దోమల నియంత్రణపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు అర్హతను పరిశీలించి, నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, భూగర్భ జలాల పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సరైన విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.

**అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలి**

వర్షపు నీటిని వృధా కాకుండా సంరక్షించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున బోర్లు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వరదలు, నష్టాల వివరాలపై సమాచారం అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398684240 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జెడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, సీపీఓ శ్రీనివాస చారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్, తదితరులు ఉన్నారు.



## భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం పూజలు..

**- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే..**

బలగం టీవీ, వేములవాడ:

జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఆలయంలోకి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, విప్ పూజలు చేశారు.

## అనంతారం గ్రామంలో కాత్యాయని కంటి హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం..

**-గ్రామాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేయడం అభినందనీయం**

**-గ్రామ సర్పంచ్ ఓల్లాల రజిత వెంకటేష్**

బలగం టీవీ, ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో కాత్యాయని కంటి హాస్పిటల్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మంది ప్రజలు కంటి పరీక్షలు చేసుకోగా అవసమైన వారికీ మందులు, కంటి అద్దాలు హాస్పిటల్ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు హాస్పిటల్ బృందం ఉచిత వైద్య సేవలు అభినందనీయమని, వారికి గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని హాస్పిటల్ వైద్యులు సింగ్, లత లతో పాటు శ్రీనివాస్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వన్డే ప్రపంచకప్ 2027 వేదికలు ఖరారు

**మూడు దేశాల్లో.. 12 నగరాల్లో మెగా టోర్నీ**
**సింహభాగం మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే..**
**అక్టోబర్ 4 నుంచి సమరం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) అద్భుతమైన తీపి కబురు అందించింది. వచ్చే ఏడాది (2027) ఆఫ్రికా ఖండంలో జరగబోయే పురుషుల వన్డే ప్రపంచకప్ (Mens ODI World Cup) వేదికలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ ప్రతిష్టాత్మక మెగా టోర్నమెంట్‌ను మొత్తంగా 12 నగరాల్లో నిర్వహించనున్నారు.

దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగిన ఒక ప్రత్యేక వేడుకలో ఐసీసీ ఈ వేదికలను అధికారికంగా ఆవిష్కరించింది. 2027 అక్టోబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 21 వరకు ఈ క్రికెట్ సంబరం జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 14 జట్లు పాల్గొంటుండగా.. విశ్వవిజేత ఎవరో తేల్చేందుకు ఏకంగా 54 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

దక్షిణాఫ్రికాలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆధునిక స్టేడియాలు, అత్యాధునిక మౌలిక వసతులు, ప్రేక్షకుల ఆదరణను పరిగణనలోకి తీసుకుని ఐసీసీ దక్షిణాఫ్రికాలోనే సింహభాగం మ్యాచ్‌లను కేటాయించింది. మొత్తం 12 వేదికలలో 8 నగరాలు



దక్షిణాఫ్రికాలోనే ఉండగా, జింబాబ్వేలో మూడు, నమీబియా రాజధాని విండ్‌హోక్‌లో ఒక నగరానికి ఆతిథ్య అవకాశం దక్కింది.

ప్రపంచకప్ ఆతిథ్య నగరాల వివరాలు:

దక్షిణాఫ్రికా (8 నగరాలు): జొహన్నెస్‌బర్గ్, సెంచూరియన్, కేప్‌టౌన్, దర్బన్, కెబెర్హ, బ్లోఎమ్‌ఫొంటెన్, పార్ల్, కుగుపో సిటీ.

జింబాబ్వే (3 నగరాలు): హరారే, బులవాయో, విక్టోరియా ఫాల్స్.

నమీబియా (1 నగరం): విండ్‌హోక్ (రాజధాని).

ఈ ప్రతిష్టాత్మక టోర్నీని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు మూడు దేశాల క్రికెట్ బోర్డులు ఇప్పటికే సంయుక్తంగా ఏర్పాట్లు ప్రారంభించాయి.

# బ్లూ టు కాషాయం

**భారత హాకీ జెర్సీ రంగు మార్పుపై దుమారం!**
**సాంకేతిక కారణాల వల్లే మార్చామన్న హాకీ ఇండియా**
**ఇది అవమానకరమంటూ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా విమర్శలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వచ్చే నెల బెల్జియం, నెదర్లాండ్స్ దేశాల్లో జరగబోయే ఎఫ్ఐహెచ్ (FIH) ప్రపంచకప్‌లో భారత పురుషులు, మహిళల హాకీ జట్లు తమ సంప్రదాయ 'బ్లూ' (నీలం) రంగు జెర్సీలకు బదులుగా 'కాషాయం' (జాఫ్రాన్) రంగు జెర్సీలతో బరిలోకి దిగనున్నాయి. హాకీ ఇండియా (HI) తీసుకున్న ఈ నిర్ణయం తీవ్ర చర్చకు దారితీసింది. భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ఈ మార్పును తప్పుబట్టగా.. హాకీ ఇండియా మాత్రం ఇది సాంకేతిక అవసరాల కోసమేనని గట్టిగా సమర్థించుకుంది.

ప్రపంచకప్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. ఈ క్రమంలో హాకీ ఇండియా కొత్త జెర్సీని సోషల్ మీడియాలో విడుదల చేసింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీక అని, ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌తో సంప్రదించిన తర్వాతే దీనిని ఖరారు చేశామని తెలిపింది.

హాకీ ఇండియా వాదన: మైదానం రంగు వల్లే మార్పు జెర్సీ రంగు మార్పుపై విమర్శలు రావడంతో హాకీ ఇండియా ఒక ప్రకటన విడుదల చేసింది. "ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ పిచ్‌లు (మైదానాలు) నీలం రంగు సింథటిక్ సర్ఫేస్‌తో ఉంటున్నాయి. మన పాత బ్లూ జెర్సీ.. మైదానం రంగులో కలిసిపోతుండటం వల్ల ఆటగాళ్లకు మైదానంలో స్పష్టత, విజిబిలిటీ సమస్యగా మారింది. అందుకే కోచ్‌లు, ఆటగాళ్లు ప్రత్యామ్నాయంగా పసుపు లేదా కాషాయ రంగును సూచించారు. చివరకు జాతీయ పతాకంలో భాగమైన, జాతీయ గర్వాన్ని చాటే కాషాయ రంగును ఎంపిక చేశాం" అని స్పష్టం చేసింది. గతంలో 2014 ప్రపంచకప్‌లో పసుపు రంగు, 2018లో స్కై బ్లూ రంగు జెర్సీలను వాడామని, ఇలా రంగులు మార్చడం ఇదే మొదటిసారి కాదని గుర్తు చేసింది.

కొత్త జెర్సీ ప్రత్యేకతలు:

జెర్సీపై భారత సంస్కృతిని ప్రతిబింబించేలా 'మండల' కళాకృతులు ఉన్నాయి.

ప్రగతికి, శాంతికి చిహ్నంగా నిలిచే అశోక చక్రం స్ఫూర్తితో




డీప్ నేవీ బ్లూ లైన్లు ఇచ్చారు.

ఛాతీ భాగంలో బలం, ఐక్యతకు ప్రతీకగా 'సుదర్శన చక్రం' మోడ్రన్ డిజైన్‌ను ఉంచారు.

భాషా వైవిధ్యాన్ని గౌరవిస్తూ జెర్సీ ముందుభాగంలో దేవనాగరి లిపిలో 'INDIA' అని రాశారు.

కిట్‌లో కాషాయ రంగుతో పాటు ప్రత్యామ్నాయంగా తెలుపు రంగు జెర్సీని కూడా చేర్చారు.

అభిమానులు కోరుకునేది బ్లూ జెర్సీనే: రస్కిన్హా హాకీ ఇండియా నిర్ణయంపై భారత మాజీ కెప్టెన్, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సీఈఓ వీరేన్ రస్కిన్హా సామాజిక మాధ్యమం 'X' లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "హాకీ ఇండియా గతంలో ఎన్నో మంచి పనులు చేసింది.. కానీ ఈ నిర్ణయం మాత్రం నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. భారత హాకీ జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగులోనే ఉంది. నేను ఎన్నో ఏళ్లుగా గర్వంగా ఆ బ్లూ జెర్సీని ధరించాను. అభిమానులు కూడా మన జట్టును బ్లూ రంగులోనే చూడాలనుకుంటారు. అసలు కాషాయ రంగు వెనుక ఉన్న లాజిక్ ఏంటి? ఇది నా స్వాభిమానం, జట్టు గుర్తింపుకు సంబంధించిన ప్రశ్న" అని ఆయన రాసుకొచ్చారు.

**క్రీడా వారసత్వానికి ప్రతీక : నవీన్ పట్నాయక్**

భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడం వివాదానికి దారితీసింది. వచ్చే నెల నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగే హాకీ ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని హాకీ ఇండియా (హెచ్ఐ) కొత్త జెర్సీని విడుదల చేయగా, దీనిపై రాజకీయ, క్రీడా వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. భారత హాకీ జట్టు జెర్సీని కాషాయ రంగులోకి మార్చడం బాధాకరమని పేర్కొన్నారు. నీలం రంగు కేవలం ఒక రంగు మాత్రమే కాదని, అది దేశ క్రీడా వారసత్వానికి, భారత హాకీ ప్రతిష్ఠకు ప్రతీక అని అన్నారు. దశాబ్దాలుగా నీలం జెర్సీ భారత జట్టుతో కలిసి విజయాలు, అపజయాల్లో దేశ ప్రజలను ఏకం చేసిందని గుర్తు చేశారు. ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ వేదికలపై భారత జట్టు నీలం జెర్సీతోనే త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిందన్నారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇదే ఒక ప్రధాన మార్పుగా కనిపిస్తోందని విమర్శించారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్యా రహానే గుడ్‌బై!

**అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన**
**క్యాప్ నంబర్ 278 ప్రయాణానికి ముగింపు..**
**భావోద్వేగపూరిత వీడియో విడుదల**
**బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విజేతగా చరిత్రలో నిలిచిపోయే కెప్టెన్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




భారత క్రికెట్ అభిమానులకు షాకిస్తూ టీమిండియా మాజీ కెప్టెన్, మిడిలార్డర్ నమ్మకస్థుడు అజింక్యా రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల (టెస్టులు, వన్డేలు, టీ20లు) నుంచి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన వీడియో ద్వారా ప్రకటించాడు.

"ప్రతీదానికీ ఆరంభం.. ముగింపు ఉంటాయనేది జీవిత సత్యం. బ్యాటింగ్‌లో టైమింగ్‌ను నమ్మినట్టే.. రిటైర్మెంట్‌కు కూడా ఇదే సరైన సమయమని భావిస్తున్నా. నా కెరీర్‌లో వ్యక్తిగత ప్రదర్శన కంటే దేశం, జట్టు విజయాలకే ప్రాధాన్యత ఇచ్చాను. భారత జెర్సీ ధరించాలనే నా కల నెరవేరింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి టీమిండియా వరకు సాగిన నా 20 ఏళ్ల ప్రయాణంలో ప్రతి క్షణాన్ని గర్వంగా భావిస్తున్నా" అంటూ రహానే భావోద్వేగానికి లోనయ్యాడు. తనకు సహకరించిన బీసీసీఐ, ముంబై క్రికెట్ అసోసియేషన్, కోచ్‌లు, ఐపీఎల్ ఫ్రాంచైజీలు, కుటుంబ సభ్యులు మరియు అభిమానులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపాడు.

చారిత్రాత్మక కెప్టెన్‌గా గుర్తింపు ఆస్ట్రేలియా గడ్డపై 2020-21లో జరిగిన ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని టీమిండియాకు అందించిన తాత్కాలిక కెప్టెన్‌గా రహానే చరిత్ర పుటల్లో నిలిచిపోతాడు. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ లేని సమయంలో, ఆటగాళ్ల గాయాల నడుమ జట్టును ముందుండి నడిపించి ఆసీస్ కోటను బద్దలు కొట్టిన తీరు అద్వితీయం. భారత్ తరపున రహానే చివరిసారిగా 2023లో బరిలోకి దిగాడు. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. సెలెక్టర్లు మొగ్గు చూపకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

రహానే అంతర్జాతీయ కెరీర్ గణాంకాలు:

టెస్టులు: 85 మ్యాచ్‌లు | 5,077 పరుగులు | 12 సెంచరీలు | 26 హాఫ్ సెంచరీలు

వన్డేలు: 90 మ్యాచ్‌లు | 2,962 పరుగులు | 3 సెంచరీలు | 24 హాఫ్ సెంచరీలు

టీ20లు: 20 మ్యాచ్‌లు | 375 పరుగులు | 1 హాఫ్ సెంచరీ

ఐపీఎల్: 212 మ్యాచ్‌లు | 5,367 పరుగులు

రెండో ఇన్నింగ్స్‌కు సిద్ధం! అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, ఆటతో తన బంధం ముగిసిపోలేదని రహానే స్పష్టం చేశాడు. తదుపరి తరం క్రికెటర్లకు తన అనుభవాలను పంచుతూ, వారికి అండగా ఉంటానని తెలిపాడు. విశ్లేషకుల అంచనా ప్రకారం, రహానే త్వరలోనే కోచ్‌గా లేదా మెంటార్‌గా క్రికెట్‌లో తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది.

# 'నాకు అత్యంత ఇష్టమైన టెస్ట్ బ్యాటింగ్ పార్ట్‌నర్ రహానే'

**విరాట్ కోహ్లీ భావోద్వేగ ట్వీట్**
**జింక్స్ కెరీర్‌పై ప్రశంసల జల్లు కురిపించిన రన్‌మెషీన్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పిన టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానేపై ప్రశంసల జల్లు కురుస్తోంది. రహానే రిటైర్మెంట్ నిర్ణయంపై భారత స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ అత్యంత భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టాడు. రహానే తనకెంతో ఇష్టమైన బ్యాటింగ్ భాగస్వామి అంటూ కొనియాడాడు.

"జింక్స్ (రహానే).. నీ అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు మిత్రమా. నువ్వు భారత క్రికెట్‌కు ఎనలేని సేవలు అందించావు. నీ సుదీర్ఘ ప్రయాణాన్ని చూసి నువ్వు ఎంతో గర్వపడవచ్చు. మైదానంలో స్లిప్ ఫీల్డింగ్‌లో నువ్వు అత్యంత నమ్మకమైన ఆటగాడివి. అంతేకాదు, టెస్ట్ క్రికెట్‌లో నాకు అత్యంత ఇష్టమైన బ్యాటింగ్ పార్ట్‌నర్‌వి నువ్వే. నీ తదుపరి జీవితం సాఫీగా సాగాలని, ఆ దేవుడి ఆశీస్సులు నీకు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా" అని కోహ్లీ తన ట్వీట్‌లో పేర్కొంటూ రహానేతో కలిసి దిగిన ఒక అందమైన ఫోటోను పంచుకున్నాడు.

టెస్టుల్లో విజయవంతమైన ద్వయం విరాట్ కోహ్లీ టెస్ట్ జట్టు కెప్టెన్‌గా ఉన్న సమయంలో రహానే దాదాపు మూడేళ్ల పాటు వైస్ కెప్టెన్‌గా (డిప్యూటీగా) వ్యవహరించాడు. వీరిద్దరి కాంబినేషన్ భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించింది. ముఖ్యంగా 2018-19లో కోహ్లీ సారథ్యంలో ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలిసారి టెస్ట్ సిరీస్ గెలవడంలో రహానే వైస్ కెప్టెన్‌గా కీలక పాత్ర పోషించాడు.

ఆ తర్వాత 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్ట్ ఓటమి అనంతరం కోహ్లీ వ్యక్తిగత కారణాలతో భారత్‌కు తిరిగి రాగా.. కష్టకాలంలో జట్టు పగ్గాలు చేపట్టిన రహానే అద్భుత నాయకత్వంతో 2-1తో సిరీస్ గెలిపించి చారిత్రాత్మక విజయాన్ని అందించాడు.

సచిన్, సెహ్వాగ్ ల అభినందనలు కోహ్లీతో పాటు క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్, మాజీ కోచ్ రవిశాస్త్రి, వీరేంద్ర సెహ్వాగ్, పుజారా, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, రిషభ్ పంత్ లతో పాటు ఒలింపిక్ విజేత పీవీ సింధు సోషల్ మీడియా ద్వారా రహానేకు అభినందనలు తెలియజేశారు.

భారత్ తరఫున 85 టెస్టుల్లో 5,077 పరుగులు, 90 వన్డేల్లో 2,962 పరుగులు, 20 టీ20ల్లో 375 పరుగులు చేసిన రహానే.. ఐపీఎల్‌లోనూ 212 మ్యాచ్‌లు ఆడి 5,367 పరుగులు చేశాడు. కాగా, మైదానాన్ని వీడిన రహానే త్వరలోనే కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



# కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్‌లో భారత్ ఘనవిజయం

**పురుషులు, మహిళల జట్లకు పసిడి పతకాలు!**
**ఫైనల్లో మలేషియాను చిత్తు చేసిన భారత ప్యాడ్లర్లు**
**సారథి మనుష్ షా అద్భుత పోరాటం..**
**క్రీడా స్ఫూర్తి చాటిన మలేషియా ఆటగాడు వాంగ్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత ప్యాడ్లర్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. త్యాగరాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన 22వ కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ పురుషులు, మహిళల టీమ్ ఫైనల్స్‌లో భారత్ జంట స్వర్ణాలతో సరికొత్త రికార్డు నెలకొల్పింది. పురుషుల జట్టు 3-2తో మలేషియాపై చెమటోడ్చి విజయం సాధించగా, మహిళల జట్టు 3-0తో అదే మలేషియాను వైట్‌వాష్ చేసి పీఠాన్ని అధిరోహించింది. టోర్నీ తొలి రోజే లీగ్ దశలో మలేషియా చేతిలో ఎదురైన పరాభవానికి పురుషుల జట్టు ఈ విజయంతో ఘనంగా ప్రతీకారం తీర్చుకుంది.

ఆకట్టుకున్న మనుష్ షా, శ్రీజ ఆకుల పురుషుల ఫైనల్లో భారత స్టార్ ప్లేయర్ మనుష్ షా తిరుగులేని ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపాడు. అతను ఆడిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి జట్టుకు వెన్నుదన్నుగా నిలిచాడు. మరోవైపు మహిళల ఫైనల్లో స్టార్ ప్లేయర్ శ్రీజ ఆకుల, స్వస్తికా ఘోష్, యశస్విని ఘోర్పడేలు అద్భుత ప్రదర్శన చేశారు. స్వస్తికా భారత్‌కు తొలి విజయాన్ని అందించగా, హోరాహోరీగా సాగిన రెండో రబ్బర్‌లో శ్రీజ.. మలేషియాకు చెందిన కారెన్ అనాక్‌పై విజయం సాధించింది. చివరగా యశస్విని.. అలిస్ చాంగ్ రక్షణ శ్రేణిని ఛేదించి భారత్‌కు బంగారు పతకాన్ని ఖరారు చేసింది.

ఉత్కంఠ రేపిన పురుషుల ఫైనల్.. క్రీడా స్ఫూర్తి చాటిన వాంగ్ మహిళల మ్యాచ్ ఏకపక్షంగా సాగినా.. పురుషుల ఫైనల్ మాత్రం అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. మనుష్ షా, వాంగ్ క్వి షెన్ మధ్య జరిగిన ఎడమచేతి వాటం ఆటగాళ్ల పోరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్ణయాత్మక గేమ్‌లో మనుష్ 4-6తో వెనుకబడి ఉన్న సమయంలో.. ప్రత్యర్థి చెమట చుక్క బంతిపై పడటంతో మనుష్ కొట్టిన షాట్ నెట్‌కు తగిలింది. పాయింట్ ముగిసిపోవడంతో అంపైర్ ఆ పాయింట్‌ను మలేషియా ఆటగాడు వాంగ్‌కే ఇచ్చారు.

దీంతో వాంగ్ 7-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే, మనుష్‌కు దురదృష్టవశాత్తూ పాయింట్ పోయిందని భావించిన వాంగ్.. తర్వాతి సర్వీస్‌ను కావాలనే నెట్‌లోకి కొట్టి అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని (Sportsmanship) చాటాడు. ఈ ఊహించని మలుపుతో పుంజుకున్న మనుష్ షా.. వరుసగా 7 పాయింట్లు సాధించి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు.

ఆ తర్వాత జీ సత్యన్, మానవ్ ఠక్కర్‌లు తమ మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో స్కోరు 2-2తో సమమైంది. అయితే నిర్ణయాత్మక ఆఖరి రబ్బర్‌లో మనుష్ షా.. మలేషియా ప్లేయర్ జావెన్ చూంగ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి ఘన విజయాన్ని అందుకున్నాడు. స్టేడియం అంతా భారత అభిమానుల జయహో నాదాలతో మారుమోగిపోయింది.



# ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో వింత ఛీటింగ్..

**'చిటిక' వేసి మోసం**
**ప్లేయర్‌పై వేటు!**
**బ్యాట్ ఎడ్జ్ సౌండ్‌ను భ్రమపరుస్తూ అంపైర్లను తప్పుదోవ పట్టించిన ఫీల్డర్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

క్రికెట్ ప్రపంచంలో స్లెడ్జింగ్, బాల్ టాంపరింగ్ వంటి వివాదాల గురించి విన్నాం కానీ, కేవలం చేతి వేళ్లతో 'చిటిక' వేసి అంపైర్లను మోసం చేసిన ఒక వింత ఉదంతం ఇప్పుడు యావత్ క్రీడా ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది. ఇంగ్లండ్‌లోని ఒక స్థానిక క్లబ్ క్రికెట్ మ్యాచ్‌లో జరిగిన ఈ ఘోరమైన ఛీటింగ్ ఉదంతం ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. అంపైర్లను బురిడీ కొట్టించిన సదరు ఆటగాడిని నెటిజన్లు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరుతో పోలుస్తూ 'క్లిక్కీ పాంటింగ్' (Clicky Ponting) అని పిలుస్తున్నారు.

అసలేం జరిగిందంటే..?

నార్త్ యార్క్‌షైర్ అండ్ సౌత్ దర్హామ్ క్రికెట్ లీగ్‌లో భాగంగా సాల్ట్‌బర్న్, మిడిల్స్‌బ్రో సెకండ్ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. సాల్ట్‌బర్న్ టీమ్‌కు చెందిన ఫీల్డర్ బ్రియాన్ డెవిన్ ఫస్ట్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా.. బంతి కరెక్ట్‌గా బ్యాటర్‌ను దాటి వెళ్తున్న సమయంలో తన వేళ్లతో గట్టిగా 'క్లిక్' (చిటిక) మనేలా శబ్దం చేశాడు.

డిజిటల్ టెక్నాలజీ (DRS లేదా స్నికోమీటర్) లేని ఈ లోకల్ మ్యాచ్‌లో.. ఆ శబ్దాన్ని విన్న అంపైర్, అది బ్యాట్ ఎడ్జ్ (బంతి బ్యాట్‌కు తగిలి) వచ్చిన సౌండ్ అని భ్రమపడి కీపర్ క్యాచ్‌గా అవుట్ ఇచ్చాడు. బ్యాటర్ తాను తప్పు చేయలేదని ఎంత మొత్తుకున్నా అంపైర్లు వినలేదు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో సదరు ఆటగాడిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'క్లిక్కీ పాంటింగ్'పై క్లబ్ నిషేధం

వీడియో ఆధారాలతో ఈ మోసం బయటపడటంతో సాల్ట్‌బర్న్ క్రికెట్ క్లబ్ తమ ఆటగాడు బ్రియాన్ డెవిన్‌పై తక్షణమే నిషేధం విధించింది. ఈ ఘటనపై మిడిల్స్‌బ్రో టీమ్ కెప్టెన్ rory కోటెరిల్ స్పందిస్తూ.. ఇది ఒక్క మ్యాచ్‌కే పరిమితం కాలేదని, ఈ సీజన్‌లో గతంలోనూ డెవిన్ ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడని ఆరోపించాడు. ఈ వింత మోసం వల్ల తమ యువ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం దెబ్బతింటోందని, ఒకే మ్యాచ్‌లో ముగ్గురు బ్యాటర్లు ఇలాగే అవుటయ్యారని ఆవేదన వ్యక్తం చేశాడు.

సంచలనంగా మారిన గణాంకాలు.. రద్దయిన స్పాన్సర్‌షిప్

ఈ వివాదం తెరపైకి వచ్చాక క్రికెట్ విశ్లేషకులు సాల్ట్‌బర్న్ కీపర్ క్యాచ్‌ల గణాంకాలను పరిశీలించగా విస్తుపోయే నిజాలు తెలిశాయి. బ్రియాన్ డెవిన్ ఆడిన 13 మ్యాచ్‌లలో కీపర్ ఏకంగా 39 క్యాచ్‌లు అందుకోగా, అతను లేని 7 మ్యాచ్‌లలో కేవలం 5 క్యాచ్‌లు మాత్రమే రావడం గమనార్హం.

ప్రముఖ అంతర్జాతీయ టీవీ వ్యాఖ్యాత పియర్స్ మోర్గాన్ ట్విట్టర్ (X) వేదికగా స్పందిస్తూ.. "క్రికెట్ చరిత్రలోనే బ్రియాన్ డెవిన్ అతిపెద్ద చీటర్" అని మండిపడ్డాడు. ఈ వివాదం తీవ్రం కావడంతో బ్రియాన్ డెవిన్‌కు స్థానికంగా స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న 'స్పైసెస్' అనే ఇండియన్ రెస్టారెంట్ యజమాని అక్మోల్ హుస్సేన్ స్పందిస్తూ.. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని, అతనితో ఉన్న స్పాన్సర్‌షిప్ డీల్‌ను తక్షణమే రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం లీగ్ యాజమాన్యం ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరుపుతోంది.

# ఘనంగా ఆషాఢ మాసం బోనాల వేడుకలు

**బలగం టీవీ, సిరిసిల్ల:**



ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం రోజు సిరిసిల్లలోని కూరగాయల మార్కెట్ లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, అలాగే పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు, పంటలు బాగా పండితేనే అందరికీ దాన్యం కూరగాయలు అందుబాటు ధరలకు దొరుకుతాయని, ప్రతి ఒక్కరూ బాగుంటారని అన్నారు.

ఇట్టి కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ తో పాటు, 20 వ వార్డు కౌన్సిలర్ కూరపాటి శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి, బత్తుల భూమేష్, గుర్రాల నర్సింలు, తడక రమేష్, దుర్గవ్వ, అంజవ్వ, శ్రీనివాస్, దేవదాస్, సత్యం మరియు కూరగాయల అమ్మకందార్లు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ

## వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

## దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్

## నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు




తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన, సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు. బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరా నికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం




విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి



## వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తు ఒడటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.









# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన




యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.